క్లుప్తంగా

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



దామరగిద్ద: మండలంలోని కాన్కుర్తిలోని సీపీఎస్ పాఠశాల ఆవరణలో ఆదివారం సక్షమ్ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ తెలిపారు. హైదరాబాద్ శంకర్ కంటి ఆస్పత్రి వీహెచ్‌వీ విజయ్‌కుమార్ ఇంటింటి సర్వే నిర్వహించారు. కంటి సమస్య ఉన్న వారిని గుర్తించి క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒకటివరకు క్యాంప్ కొనసాగుతుందన్నారు. బస్వరాజ్, గంగాధర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో డేటా ఎంట్రీ



మద్దూరు: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి, విద్యా, కుల గణన డాట ఎంట్రీ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రారంభించినట్లు ఎంపీడీఓ నర్సింహారెడ్డి తెలిపారు. ఉమ్మడి మండలంలో 29మంది డాట ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా సమాచారం ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మండలంలో 17, 172 ఇళ్లను ఎన్యుమరేటర్లు సర్వే చేశారు. మరో రెండు రోజుల్లో పూర్తి సర్వే పూర్తవుతుందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 94.5 శాతం సర్వే పూర్తయినట్లు తెలిపారు.

అవినీతి అధికారులపై ఫిర్యాదు చేస్తాం..

మరికల్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అవినీతి అధికారులపై సీఎం రేవంత్‌కు ఫిర్యాదు చేస్తామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ కార్యాలయం అవినీతి, అక్రమాలకు అడ్డగా మారిందని, ఇక్కడ పేదలకు న్యాయం జరగడం లేదన్నారు. అవినీతికి అలవాటు పడిన అధికారులు తమ పనితీరును మార్చుకోకపోవడంతో వారిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మద్దూరు: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డీఎస్ఓ సుదర్శన్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం కోసం సరఫరా చేసినా బియ్యాన్ని పరిశీలించారు. అలాగే విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. బియ్యం నాసిరకంగా ఉంటే మాకు సమాచారం ఇస్తే వాటిని మార్చి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం

కోస్గిరూరల్: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని పందిరిహనుమాన్ గ్రామానికి చెందిన తుడుం అంజిలయ్య తమ వ్యవసాయ పొలంలో పశువుల మేతకోసం గడ్డిని నిల్వ చేశాడు. శుక్రవారం ఉదయం ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పు అంటుకుని సుమారు రూ. 25వేల ఆస్తి నష్టం జరిగింది. ప్రభుత్వం స్పందించి ఆర్థికసాయం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

పాఠశాల ఆవరణలో మందుబాటిళ్లు

నర్వ: మండలంలోని కల్వాల్ ఉన్నత పాఠశాల ఆవరణలో మందుబాబులు రాత్రి వేళల్లో తాగి బాటిళ్లు పడవేస్తున్నట్లు పాఠశాల విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల ప్రహరి ఉన్నప్పటికీ రాత్రి వేళల్లో ఇక్కడే మద్యం సేవించి బాటిళ్లు పగల కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించి పాఠశాల ఆవరణలో మందుబాబులు మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.



బడుల బలోపేతానికి తోడ్పాటు



పెద్దజట్రం పాఠశాలలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లు



మరుగుదొడ్ల ప్రారంభోత్సవం (ఫైల్)

- విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు రోటరీ క్లబ్ కృషి
- పెద్దజట్రం జెడ్పీహెచ్‌ఎస్‌లో రూ. 20 లక్షలతో మరుగుదొడ్లు, డెస్క్ బెంచీల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఊట్కూర్: పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యతమైన విద్య అందించాలని ప్రభుత్వం ఆశయంతో ఉన్న... పలు పాఠశాలలో అధికారుల నిర్లక్ష్యం వల్ల మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురువుతున్నారు. దీంతో పలు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి పాఠశాలల్లో మౌళిక వసతులు ఏర్పాటు చేస్తుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెద్దజట్రం ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి నుంచి పదోతరగతి వరకు 286మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లుతోపాటు తరగతి గదుల్లో సరియైనా బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న రోటరి ఫౌండేషన్ వారు ముందుకొచ్చి రూ. 10లక్షల వ్యయంతో మరుగుదొడ్లు, వంద డెస్క్ బెంచీలను ఏర్పాటు చేశారు. పది మూత్రశాలలు, పది వాష్‌రూం నిర్మించారు. 6, 7 తరగతి గదుల్లో బెంచీలను ఏర్పాచేశారు. పాఠశాలలో స్వచ్ఛంద సంస్థవారు మౌలిక వసతులు ఏర్పాటు చయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాభివృద్ధికి కృషిచేస్తాం...



మారుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధికి రోటరి ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ కృషిచేస్తుంది. మండలంలోని పెద్దజట్రం ఉన్నత పాఠశాలలో రూ. 40లక్షల వ్యయంతో మరుగుదొడ్లు, డెస్క్ బెంచీలను ఏర్పాటు చేశాం. మౌలిక వసతులు లేని పాఠశాలలను గుర్తించి అభివృద్ధికి సహకరిస్తాం.

–ఎస్.సురేస్ పోరూరి, రోటరి గ్లోబల్ గ్రాంఢ్స్ చైర్మన్, హైదరాబాద్



తరగతి గదిలో ఏర్పాటు చేసిని డెస్క్ బెంచీలు

ఇళ్లకు వెళ్లేవాళ్లం..



పాఠశాలల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో మలమూత్ర విసర్జనకు ఇళ్ళకు వెళ్లాల్సి వచ్చేది. మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు దూరమయ్యాయి. ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థవారికి కృతజ్ఞతలు.

–గాయత్రి, 9వ తరగతి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద్దజట్రం

వసతులు ఏర్పాటు చేయడం సంతోషకరం..



రోటరి ఫౌండేషన్ వారు పాఠశాలలో మరుగుదొడ్లు, వంద డెస్క్‌బెంచీలు ఏర్పాటు చేశారు. 6, 7 తరగతుల్లో బెంచీలను వేశాం. మరుగుదొడ్లు లేక పోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. స్వచ్ఛంద సంస్థవారు ముందుకొచ్చి మౌలిక వసతులు ఏర్పాటు చేయడం సంతోషకరం.

–గౌరమ్మ, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఊట్కూర్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి: పట్టణంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా శనివారం సాయంత్రం 2 గంటల నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతు కారణంగా కోస్గి సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న కోస్గి మున్సిపల్ పరిధిలోని గ్రామాలతోపాటు విద్యుత్ సరఫరా ఉండొద్దన్నారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని సూచించారు.

ఈ పాస్ ద్వారా ఎరువులు విక్రయించాలి



కోస్గిరూరల్: ఫర్టిలైజర్స్ దుఖాణాలకు లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే సీజ్ చేస్తామని గుండుమాల్ మండల వ్యవసాయ ఆధికారిణి రేష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ కార్యాలయంలో ఫర్టిలైజర్స్ డీలర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ దుఖాణంలో స్టాక్ రిజిష్టర్లు, రసీదు బుక్కులు విధిగా అందుబాటులో ఉంచాలని, ఎరువులు తప్పనిసరిగా ఈపాస్ ద్వారానే విక్రయించాలన్నారు. విత్తనాలు, ఎరువులు నిర్ణయించిన ధరలకు విక్రయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓలు తిరుపతి, హర్షవర్ధన్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం..



క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఖోఖో శిక్షణ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మెరుగైన శిక్షణ పొందిన వారు జాతీయస్థాయిలో రాణించాలని కోరారు. అన్ని విధాలుగా తనవంతుగా సహాయం అందజేస్తానని తెలిపారు. మారుమూల ప్రాంతాల నుంచి 10రోజులుగా శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడంపై ఫిజికల్ డైరెక్టర్ బి.రూపను అభినందించారు. అనంతరం క్రీడాదస్తులను అందజేశారు. కార్యక్రమంలో చంద్రకాంత్‌గౌడ్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సతిమణి లలిత, గోపాలం, కృష్ణమూర్తి, కోచ్‌లు రంజిత్, సతీస్, రూప, జీహెచ్‌ఎం వెంకటయ్య, ఉపాధ్యాయులు ఎల్లప్ప, నరేష్, శిరిష, రవిగౌడ్, కోళ్ల వెంకటేష్, గణేష్ కుమార్, కట్టసురేష్ పాల్గొన్నారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



మక్తల్: మున్సిపల్ పరిధిలోని ఉన్న ఎస్సీ హాస్టల్, బాలికల, బాలుర హాస్టళ్లను శుక్రవారం అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే మధ్యాహ్నభోజన ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనం రుచితో పాటు పరిశుభ్రత పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన తహసీల్దార్



కురగాయలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింధుజా

ధన్వాడ: మండలంలోని కస్తుర్బా గాంధీ పాఠశాలను మండల తహసీల్దార్ సింధుజా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్బంగా విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అలాగే మధ్యాహ్నభోజన ఏజెన్సీ మహిళలతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే భోజనం రుచితో పాటు పరిశుభ్రత పాటించాలని సూచించారు.

నెట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు

ధన్వాడ: ఈ నెల 23నుంచి 25వరకు మహబూబాబాద్ జిల్లాలోని కాల్వాల్లో జరిగే 68వ తెలంగాణ రాష్ట్రస్థాయి పాఠశాల క్రీడా సమైక్య, అంతర్ జిల్లాల నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు తరపున పాల్గొనేందుకు మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాల మినీ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు గణేష్, వంశీచంద్, సిద్దు, శివకుమార్, కిషోర్, సతీష్ ఎంపికైనట్లు స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. వీరి ఎంపికపై పీడీ డా.రామ్మోహన్‌గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సాంబయ్యానాయక్, పీఈటీ ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం అధికారులు మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీఓ ధనుంజయ, తహసీల్దార్ రాజు తదితరులు మధ్యాహ్న భోజన సమయంలో పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బియ్యాన్ని శుభ్రం చేసి వండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని నిర్వాహకులకు అధికారులు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కుసుమ, గ్రామ కార్యదర్శి శ్రీనివాసారావు తదితరులు పాల్గొన్నారు.

క్వింటాల్‌కు రూ. 500బోనస్ చెల్లించాలి



మక్తల్: ప్రభుత్వం వరి ధాన్యం క్వింటాల్‌కు రూ. 500 బోనాస్ ఇవ్వాలని ఏఐకేఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. అనంతరం రైతులతో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్వామినాథన్ సిఫారసు ప్రకారం క్వింటాల్‌కు వరికి రూ. 500 నిర్ణయించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్ లైన పార్టీ నాయకులు కిరణ్, భగవంతు, వెంకట్‌రెడ్డి, వెంకటేస్, రాజు, భాస్కర్, రమేష్ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు వినతి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట ఎడ్యుకేషన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో శివాజీ నగర్ లోని ప్రభుత్వ పాఠశాల ఎదుట కాలనీవాసులు ఇంటి చెత్తను పడేస్తున్నారని.. దీంతో విద్యార్థులకు దుర్వాసన రావడమే కాక చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సునితకు ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఏబీవీపీ నాయకులు సతీష్, ఇంతియాజ్, వెంకటేష్, ఓంకార్, చరణ్‌రెడ్డి, వివేకానంద ఉన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కు అందజేస్తున్న నందు నామాజీ

నారాయణపేట: ప్రజలకోసం అమలు చేసే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందు నామాజీ అన్నారు. జిల్లా కేంద్రంలోని బురుడివాడికి చెందిన జ్యోతిలక్ష్మి అనారోగ్యంతో చికిత్స పొందడంతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ. 18వేల చెక్కును అందజేసి మాట్లాడారు.. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సహాయం అందించిన మంత్రి కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి అపిరెడ్డిపల్లి రాము, కౌన్సిలర్ రాఘవేంద్ర, హన్మంతురావు పాల్గొన్నారు.

ఘనంగా నారాయణతీర్థుల ఆరాధనోత్సవాలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం నారాయణతీర్థుల ఆరాధానోత్సవాలు ఘనంగా కొనసాగాయి. ఆలయంలో పంచామృతాభిషేకం, భజన, పల్లకీ సేవ తదితర ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ జ్యోతిష్య పండితులు విద్వాన్ అనిల్ దేశాయి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలన్నారు. ఆలయ అర్చకులు నర్సింహాచారి, సేవా సమితి సభ్యులు నారాయణరావు, నరసింహ, గోపినాథ్, మంజునాథ్, భక్తులు పాల్గొన్నారు.

గుట్కా పాకెట్ల స్వాధీనం



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని సరాఫ్ బజార్‌లోని అశోక్ పసరిపై కిరాణా దుఖాణంలో శుక్రవారం స్థానిక టాస్క్‌పోర్స్ పోలీసులు దాడులు చేసి రూ. 38,985 విలువ గల ప్రభుత్వ నిషేధిత గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అశోక్ పసరిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉపాధ్యాయులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి



మరికల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

దామరగిద్ద: మధ్యాహ్న భోజనం నిర్వహణలో నిర్లక్ష్యం వహించారంటూ మాగనూర్ పాఠశాల ఉపాధ్యాయులపై ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని అన్నారు. శుక్రవారం మండలంలోని పాఠశాలలో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

ధన్వాడ: మాగనూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను సస్పెన్స్‌ను నిరసిస్తూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. మధ్యాహ్నభోజన బాధ్యతల నుంచి ఉపాధ్యాయులను పూర్తిగా మినహాయించాలని వారు డిమాండ్ చేశారు.

కోస్గి రూరల్: గుండుమాల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు మధ్యాహ్నభోజన విరామ సమయంలో నల్లా బ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. అనంతయ్య, నర్సింహులు, నరేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

మరికల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారు కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ.. మాధ్యాహ్న భోజన విషయంలో ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం సరికాదని అన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

నారాయణపేట టౌన్: జీవీకే ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సంస్థ 108 అంబులెన్స్‌లో 'ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్' గా పనిచేస్తున్న శ్రీనివాస్ గ కొన్నిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ప్రమాద బీమా కింద మంజూరైన రూ. 5 లక్షల చెక్కును వారి కుటుంబానికి ఆ సంస్థ నిర్వాహకులు అందజేశారు. ఆయనతో పాటు ఎగ్జిక్యూటివ్ రాఘవేందర్, ఉదయ్ కుమార్, సిబ్బంది రాజ్ కుమార్, వెంకటయ్య, భారత్ కుమార్ ఉన్నారు.



ఘనంగా దొరోళ్ల లక్ష్మమ్మ బోనాలు



అమ్మవారి ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు



అమ్మవారికి బోనాల వేడుకలు

కోస్గి: పట్టణ శివారులోని దొరోళ్ల లక్ష్మమ్మ గ్రామ దేవతకు ముదిరాజ్‌లు శుక్రవారం రాత్రి బోనాల వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్తీకమాసం చివరి శుక్రవారం అమ్మవారికి బోనాల వేడుకను నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా బెస్త కులస్తులు తమ కులవృత్తికి వాడే చేపల వలలను ప్రత్యేకంగా అలంకరించగా మహిళలు, యువతులు బోనాలతో ర్యాలీగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో నిర్వహించిన పోతురాజుల విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆలయ ప్రాంతాలతోపాటు ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు కుల పెద్దలు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.